క్లుప్తంగా

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ


సాయిబాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆకివీడు : స్థానిక బైపాస్‌రోడ్డులోని వెంకయ్య వయ్యేరు పంట కాలువకు చేర్చి సాయి మందిర పునఃప్రాణప్రతిష్ఠ, సాయిబాబా పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆలయం వద్ద సాయి కోటి నామ లిఖిత మహా యజ్ఞం జరిగింది. గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక లయన్స్ ప్రతినిధి సన్నిధి వెంకన్నబాబు, లక్ష్మీ రాజ్యం దంపతులు విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

ప్రత్యేక అలంకరణలో ఉమా సోమేశ్వర స్వామి


ఉమాసోమేశ్వర స్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీకమాసోత్సవాల్లో భాగంగా 22 రోజు మంగళవారం గునుపూడి పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అభిషేకాలు, హోమాలు, దర్శనం టిక్కెట్లు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.9,450 ఆదాయం లభించినట్టు ఈఓ డి.కృష్ణంరాజు తెలిపారు. ఏర్పాట్లను ధర్మకర్తల మండలి సభ్యులు కుర్మదాసు సత్యశ్రీనివాస్, నాచుశ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, కోయతాతాజీ, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్


మెడల్ అందుకుంటున్న విద్యార్థి పవన్

భీమవరం: ఇటీవల పెనుగొండ డిగ్రీ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ అంతర్ కళాశాలల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి వెంపాడ పవన్ గోల్డ్ మెడల్ సాధించాడని ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన తెలిపారు. 54 కిలోల విభాగంలో సత్తాచాటి యూనివర్శిటీ తరపున చండీగఢ్‌లో జరిగే అంతర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్‌ను పీడీ ధనుంజయ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం, పి.అరవింద స్వామి, పి.రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ మహేశ్వరరావు

మొగల్తూరు: మిచాంగ్ తుపాను ప్రభావం దృష్ట్యా ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డి.మహేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం మొగల్తూరు పీహెచ్‌సిలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను దృష్ట్యా నియోజకవర్గంలో 14 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. తూర్పుతాళ్లలో 10, ఎల్‌బీ చర్లలో 2, మొగల్తూరు పీహెచ్‌సీలో 2 శిబిరాలు ఏర్పాటు చేశామని 55 మంది పారావైద్య సిబ్బందిని ఆరుగురు వైద్యాధికారులను అందుబాటులో ఉంచామన్నారు. 18 మంది గర్భిణులను వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. తమ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ వి.ప్రసాద్, డాక్టర్ కె.లక్ష్మీపార్వతి ఎంపీహెచ్‌ఓ కేబీకేఎస్ రమేష్ రెడ్డి, ఏఎస్‌ఎస్ ఎన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పోడూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పులు రావడంతో పశువులకు దొమ్మ వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్య అధికారి డా.ఎస్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం మండంలోని వద్దిపర్రు గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ పంట కాలువలు, మురుగు కాలువలు, పరివాహక గ్రామాలలోని కలుషిత నీటి వల్ల దొమ్మ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, అందువల్ల రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలని కోరారు. ఏ రైతుకు చెందిన పశువైనా చనిపోతే సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని పశు సహాయకుడికు, వీఆర్వో ద్వారా పశు వైద్యులకు సమాచారం అందిస్తే నష్టపరిహారం అందజేస్తారని ఆయన తెలిపారు.


భీమవరం అర్బన్: చెరువులో చేపలు, రొయ్యలు కొట్టుకుపోకుండా ఏర్పాటుచేసిన వల


ఉండి : ఎన్నార్పీ అగ్రహారంలో నీట మునిగిన రోడ్డు


భీమవరం(ప్రకాశం చౌక్): నీటమునిగిన లూథరన్ గ్రౌండ్


ఆకివీడు: నీట మునిగిన బస్ స్టాండ్ ప్రాంతం

స్తంభించిన జనజీవనం


కాళ్ల: కాళ్లలో జలమయమైన రోడ్డు


కాళ్ల: కోమటి గుంటలో నిలిచిన వర్షం నీరు


కాళ్ల: ఎల్ఎన్‌పురంలో నీట మునిగిన రోడ్డు


ఆకివీడు: నీట మునిగిన మాదివాడ గంగానమ్మ, మద్దిరావమ్మ ఆలయ ప్రాంగణం

భీమవరం అర్బన్: తుఫాన్ ప్రభావంతో మంగళవారం భీమవరం మండలం యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, అనాకోడేరు, కొమరాడ, చినఅమిరం, రాయలం, కొత్తపూసలమర్రు, దెయ్యాలతిప్ప, దొంగపిండి, లోసరి, తోకతిప్ప, నాగిడిపాలెం తదితర గ్రామాల్లో రోజంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. పల్లపు గ్రామాలైన నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, దొంగపిండి, లోసరి, కొత్తపూసలమర్రు తదితర గ్రామాల్లోని రోడ్లపై నీరు ప్రవహించింది. గాలులకు విద్యుత్ వైర్లు కొన్ని చోట్ల తెగిపోవడంతో వాటిని విద్యుత్ శాఖ సిబ్బంది పునరుద్ధరించారు. కళ్లాల్లో ధాన్యం రాశాలు తడిచిపోకుండా చుట్టూ రైతులు నాలి తీశారు. పలు గ్రామాల్లో వరి పంట నేలనంటింది. ఆక్వా చెరువులు ముంపుకు గురవడంతో చెరువులు గట్లపై చేపలు, రొయ్యలు వెళ్లకుండా మెస్‌లు, వలలు ఏర్పాటు చేసుకున్నారు. తాడేరు, బేతపూడి, రాయలం, అనాకోడేరు, యనమదుర్రు, గునుపూడి తదితర గ్రామాల్లో వరిచేలను మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ వరి చేలను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలు, రైతులు సమన్వయంతో ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు వెళ్లకుండా అడుగు మేర లోతుగా నాలి తీయాలని, చేలల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా అవుట్‌లెట్ ద్వారా బయటకు పంపించాలని సూచించారు. చేలల్లో మూడు, నాలుగు వరి దుబ్బులు కలిపి పడకుండా కట్టాలన్నారు. ఏఓ వెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

భీమవరంలో నీటమునిగిన రోడ్లు

భీమవరం(ప్రకాశం చౌక్): భారీ వర్షాలకు మంగళవారం భీమవరం పట్టణంలో వీధి రోడ్లు నీటమునిగాయి. జనం రాకపోకలు ఇబ్బందులు పడ్డారు. హౌసింగ్ బోర్డు కాలనీ, బ్యాంకు కాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపైనా, లూథరన్ గ్రాండ్, డీఎన్ఆర్ కళాశాల గ్రాండ్‌లోకి వర్షం నీరు చేరింది. 38 వార్డులో మెయిన్ డ్రెయిన్‌లోని పూడిక తీసి నీటిని యనమదుర్రు డ్రెయిన్‌లోకి మళ్లించారు. దీంతో దుర్గాపురంలోని వర్షం నీరు వేగంగా బయటకు పారుతోంది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీటిని మోటార్లతో బయటకు తోడేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

అధికారులు, నాయకుల క్షేత్ర స్థాయి పర్యటన

వీరవాసరం: మిచాంగ్ తుఫాను నేపథ్యంలో మండల కేంద్రమైన వీరవాసరంతోపాటు రాయకుదురు, కొణితివాడ, చింతలకోటి గరువు, అండలూరు, వడ్డిగూడెం, తోకలపూడి, మత్స్యపురి, తోలేరు, మడుగుపోలవరం తదితర గ్రామాల్లో మండల అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పర్యటించారు. రైతులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సూచనలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, గుడూరి ఓంకార్, గెడ్డం భారతి, తహసీల్దార్ సుందర్రాజు, ఏఓ బిన్నిబాబు, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీటీసీ బొల్లంపల్లి శ్రీనివాస చౌదరి, సర్పంచ్ సైదు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముంచిన మిచాంగ్

ఆకివీడు: భారీ వర్షాలకు ఆకివీడు వీధులన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై రెండుగుల మేర నీరు నలిచిపోయింది. అమృతరావు కాలనీ, జానకీనగర్, శ్రీనగర్, సమతానగర్, జవహర్‌పేట, సాలిపేట, మాదివాడ, సంతపేట, ఉల్వర్షన్‌పేట, పెదపేటలోని రోడ్లు నీటమునిగాయి. ఇళ్లల్లోకి నీరు ప్రవేశించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమృతరావు కాలనీ శ్మశానవాటిక ప్రాంత ప్రజల ఇళ్లు పూర్తిగా నీట మునిగాయి. సమస్యను స్థానిక నాయకులు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ జి.కృష్ణమోహన్‌తో మాట్లాడారు. పునరావాస కేంద్రానికి సుమారు 70 కుటుంబాలకు చెందిన 156 మందిని తరలించారు. వారికి భోజన సదుపాయం కల్పించారు. నీట మునిగిన ప్రాంతాల్ని చైర్‌పర్సన్ జామి హైమావతి, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు సందర్శించారు. ముంపునీటి మళ్లింపు చర్యలు చేపట్టారు. మండలంలో నీట మునిగిన వరి చేలను ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాస్, ఏఓ ప్రియాంక, వీఏఏలు సందర్శించి, రైతులకు తగు సూచనలిచ్చారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

కాళ్ల: భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎల్ఎన్‌పురం, మోడీ, కాళ్ల కోమటిగుంట, కాళ్లకూరు తదితర శివారు గ్రామాల్లో ప్రధాన రహదారులపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలోని ప్రధాన, అంతర్గత రహదారులపై నీరు నిలిచింది. వరి పంట పొలాలు నీట మునిగాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు వరి దుబ్బులను కట్టలుగా కడుతున్నారు. ఇప్పటికే రెవెన్యూ, అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. శివారు గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.

దంచికొట్టిన వాన

ఉండి: తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా భారీ వర్షాలు దంచికొట్టాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రెండు రోజుల నుంచి వరిచేలు నేలకొరిగాయి. భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయభ్రాంతులకు గురయ్యారు. దఫదఫాలుగా వర్షం కురుస్తుండటంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 276 ఎకరాల వరిచేను ముంపుకు గురైనట్టు మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. 560 ఎకరాల్లో వరి నేల వాలిందన్నారు. మొత్తం 10,790 ఎకరాలకు 3,054 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్టు చెప్పారు.

బాధితులకు అన్నదానం

ఉండి మండలం ఉణుదుర్రు గ్రామంలో తుఫాను బాధితులకు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకురాలు అల్లూరి మాధవీ అంజిరాజు అన్నదానం చేశారు. అపత్కాలంలో నిరుపేదలను ఆదుకోవడం కనీస ధర్మమని అందుకే భారీ వర్షంతో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు ఆహార పొట్లాలు అందించామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కూనపరాజు వర్మ, పార్టీ లీగల్ సెల్ మండలాధ్యక్షుడు జి.సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం


వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం: ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంపై మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. భీమవరం, వీరవాసరం మండలాల తహసీల్దార్లతో ఆయన ఫోన్లో మాట్లాడారు. రైతులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, తుఫాను ప్రభావం తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం భీమవరంలోని దుర్గాపురం స్కూల్, మెంటేవారి తోట స్కూల్, లంకపేట చర్చి, భీమవరం మండలం దొంగపిండి, నాగిడిపాలెం లోసరి గ్రామాల్లో ప్రస్తుతానికి పునరావస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీరికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలూ కల్పిస్తుందని చెప్పారు. ఈ కేంద్రాల వద్ద ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడిన చోట వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించాలని, భీమవరం పట్టణంలో కురిసిన వర్షం నీరు యనమదుర్రు డ్రెయిన్‌లోకి మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాస్, ఏఓ నిమ్మల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఎం శ్యామల పాల్గొన్నారు.


భీమవరం అర్బన్: తాడేరులో ముంపు వరిచేలను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్


ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలో నీట మునిగిన ప్రాంతాల్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జామి హైమావతి


భీమవరం అర్బన్: దొంగపిండిలో భారీ వర్షం కురవడంతో జలమయమైన రోడ్డు


ఉండి : ఉణుదుర్రులో అన్నదానం చేస్తున్న సుందర్‌కుమార్


ఆకివీడు: నీట మునిగిన శివాలయం వీధి


వీరవాసరం : రాయకుదురులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధం


నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు : మిచాంగ్ తుఫాన్ ప్రభావం నియోజకవర్గంలో తీవ్రంగా ఉందని, బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుఫాన్ తీవ్రతను ముందే గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారుల్ని అప్రమత్తం చేశారని తెలిపారు. భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు నీట మునిగాయని, ప్రజలకు పునరావాసం, సదుపాయాలు కల్పించే విధంగా అధికారులకు సూచనలిచ్చామని చెప్పారు. ఆయా మండలాల్లో పాఠశాలలు, ఇతరత్రా భవనాల్లో పునరావాసం కల్పించనున్నట్టు తెలిపారు. ఆకివీడు నగర పంచాయతీలోని పలు ప్రాంతాలను ముంచెత్తిన నీటిని బయటకు మళ్లించే చర్యలు చేపట్టాలని కమిషనర్, చైర్‌పర్సన్‌లకు ఆదేశాలిచ్చామన్నారు. రెండు జేసీబీలతో ఆయా ప్రాంతాల్లో ముంపునీటి పారుదలకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.

ఆందోళన వద్దు

నియోజకవర్గంలో ఖరీఫ్ వరి రైతులు ఆందోళన చెందవద్దని పీవీఎల్ విజ్ఞప్తి చేశారు. వరి చేలల్లో నీరు నిలిచిపోయిందని, రాసులుగా ఉన్న ధాన్యాన్ని కాపాడుకొనేందుకు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంట నష్టపోతే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని, పంటల బీమా వర్తింపజేసుందని చెప్పారు. ఆయా గ్రామాల్లో రాసులపై ఉన్న ధాన్యాన్ని వ్యవసాయాధికారులు తనిఖీలు చేసి, తడిసిన ధాన్యాన్ని కాపాడేందుకు సూచనలిస్తున్నారని వివరించారు. ముంపు ప్రాంతాలను తాను బుధవారం సందర్శిస్తానని పీవీఎల్ చెప్పారు.

రైతులకు అండగా సీఎం జగన్

పెనుగొండ: అకాల వర్షంతో ఏ ఒక్క రైతు నష్టపోకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షణ చర్యలు చేపట్టారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆచంట నియోజకవర్గంలో నీట మునిగిన పలు గ్రామాల్లోని వరిచేలను పరిశీలించారు. ముందస్తు సమాచారంతో అధికారులను అప్రమత్తం చేసి నష్ట నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు, ధాన్యం విక్రయాల్లో నిబంధనలు సడలించి రైతులకు అండగా నిలిచారన్నారు. తేమతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగిందన్నారు. నియోజకవర్గంలో సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించడం జరిగిందన్నారు.

ముంపు చేలను పరిశీలించిన కలెక్టర్


సీసలిలో వరి పొలాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కాళ్ల: తుఫాను ప్రభావంతో నీట మునిగిన వరి పంట పొలాలను జిల్లా కలెక్టర్ ప్రశాంతి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. కాళ్ల మండలం సీసలి గ్రామంలో నేలకొరిగిన వరిచేలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మండలంలో ప్రధాన డ్రెయిన్ మొగదిండి తూడు, గుర్రపు డెక్కతో పూడుకుపోవడంతో ముంపు సమస్య తలెత్తిందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. మండలంలో 3878 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో 1,100 ఈదురుగాలులకు పడిపోయిందని, మరో 1200 ఎకరాల పంట నీటమునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. బుధ, గురువారాల్లో ఎగువ ప్రాంతాల వర్షపునీటి వల్ల పంటనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ముంపు నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జేసీ ఎస్ రామసుందరరెడ్డి, ప్రత్యేక అధికారి కన్నబాబు, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, వ్యవసాయశాఖ జేడీ జెడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణారావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రభాకరావు, ఏఓ జయవాసుకి, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.